క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధం.. నూతన మతాల ఆవిర్భావం

సెక్షన్-1, యూనిట్-1

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధంలో ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో సంభవించిన మార్పులు కొత్త మతాల ఆవిర్భావానికి దారి తీశాయి. అంతకు ముందు కాలంతో పోల్చితే ఇనుము వాడకం ఎక్కువై ఎన్నో ఆర్థిక, సాంఘిక మార్పులు సంభవించాయి. సాంఘిక ఆర్థిక పరిణామాలు ఆధ్యాత్మిక రంగంలో భావ విప్లవానికి కారణమయ్యాయి.

నూతన సాంఘిక, ఆర్థిక పరిణామాలకు, వైదిక కర్మకాండలకు వైరుధ్యం ఏర్పడింది. ఫలితంగా క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధంలో గంగా నదీ లోయలో ఎందరో నవ తాత్వికులు అవతరించారు. వారిలో ముఖ్యమైన వారు..

- **అజీత కేశ కంబలి:** మరణానంతరం మానవుడు ధూళిలో కలిసిపోతాడని, మరణానంతర జీవితం ఉండదని, పరిపూర్ణమైన భౌతిక వాదాన్ని ప్రవచించాడు. లోకాయత లేదా చార్వాకతత్వం ఇతని ఆలోచనల ప్రభావానికి గురైంది.
- **పకుధ కాత్యాయన:** భూమి, నీరు, గాలి, కాంతి వంటి ప్రాథమిక, అవిభాజ్య వస్తువుల మాదిరిగానే దుఃఖం, సంతోషం, జీవితం కూడా అవిభాజ్యమైందని భావించాడు. తదనంతర కాలంలో వైశేషిక దర్శనంగా వ్యాప్తిలోకి వచ్చిన తత్వానికి ఇతనే దారి చూపాడని చెప్పొచ్చు.
- **పురాణ కస్యప:** దేహం, ఆత్మ, విభిన్నమైన అస్తిత్వాలని చెబుతూ, సాంఖ్య దర్శనానికి దారి చూపాడు.
- **మక్ఖలి గోసల:** ఆజీవక మతశాఖ స్థాపకుడు. ఆత్మ ముందే నిర్దేశించిన పునర్జన్మల చక్రం ద్వారా ప్రయాణించవలసిందేనని.. మానవ జీవితంలోని ప్రతి చిన్న అంశం ముందే నిర్దేశించి ఉంటుందని భావించాడు. మానవ ప్రయత్నం వల్ల ఏమీ మారదని, కాబట్టి మానవుడు తిని, తాగి సుఖించాలని వాదించాడు.

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధంలో ఇలాంటి మత శాఖలెన్నో ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో జైన, బౌద్ధాలు మాత్రమే వ్యవస్థీకృత మతాలుగా నిలదొక్కుకున్నాయి.

Q జైన, బౌద్ధ మతాలు ఆవిర్భవించడానికి గల కారణాలు విశ్లేషించండి.

A క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధంలో తూర్పు ఉత్తర ప్రదేశ్, బీహార్‌లలో ప్రజల భౌతిక జీవితంలో వచ్చిన మార్పులు జైన, బౌద్ధ మతాల ఆవిర్భానికి ప్రధాన నేపథ్యంగా పని చేశాయని చెప్పొచ్చు.

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధం నాటికి ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో ఇనుము వినియోగం ఎక్కువైంది. ఇనుప పనిముట్లతో అడవులు తొలగించడం, భూమిని సాగు చేయడం ఎక్కువైంది. సమకాలీన సాహిత్యాన్ని బట్టి పంటల సాగుకు సంబంధించిన పరిజ్ఞానం తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నూతన వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థ ప్రభు



త్వాల మనుగడకు, వాణిజ్య వికాసానికీ ప్రధానమైంది. ఈ వ్యవసాయిక వ్యవస్థకు పశు సంపద అత్యంత కీలకం. కానీ వైదిక మతం యజ్ఞాల సాకుతో పశు సంపదను వధించడం వల్ల సహజంగానే ఆ మతంపై నిరసన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలోనే జీవహింసను నిరసిస్తూ జైన, బౌద్ధ మతాలు అవతరించాయి.

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధం నాటికి వర్ణ వ్యవస్థ ఘనీభవించసాగింది. హెచ్చు, తగ్గులతో కూడిన సామాజిక వ్యవస్థలో అత్యున్నత స్థానాన్ని పొంది, పన్నుల నుంచి మినహాయింపు పొందిన బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని పాలక వర్గాలైన క్షత్రియులు హర్షించలేదు. బ్రాహ్మణాధిక్యాన్ని బలపరిచే వైదిక మతానికి ప్రత్యామ్నాయ మతాలను క్షత్రియులు ఆశించారు. జైన, బౌద్ధాలను స్థాపించిన వర్ధమానుడు, సిద్ధార్థుడు క్షత్రియులే కావడం యాధృచ్ఛికం కాదు.

వర్ణ వ్యవస్థ పట్ల వైశ్యులు, శూద్రులు కూడా నిరసన పెంచుకున్నారని భావించొచ్చు. క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధంలో సంభవించిన వ్యవసాయిక పురోగతి కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో 'గహపతు'లుగా.. పట్టణ ప్రాంతాల్లో 'సెట్టి'గా పిలిచే వైశ్య వర్గాలు బలపడ్డాయి. చిహ్న ముద్రల నాణేలు (Punch marked coins) వాణిజ్యానికి దోహదం చేశాయి. ఈ నేపథ్యంలో ఆర్థికంగా ఎదిగిన వైశ్యులు.. వర్ణ వ్యవస్థ తమకు అందించిన మూడో స్థానంతో సంతృప్తి చెందలేదు. అలాగే వర్ణ వ్యవస్థలో అట్టడుగున ఉన్న శూద్రులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఈ కాలంలోనే భారత దేశంలో 'అస్పృశ్యత' కూడా తలెత్తింది. అస్పృశ్య వర్గాలు దారుణ వివక్షకు గురవడం మొదలైంది. కాబట్టి క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధం సమాజంలో వివిధ వర్గాలు అసంతృప్తికి గురయ్యాయని చెప్పొచ్చు. వర్ణ వ్యవస్థ, ఆ వ్యవస్థను బలపరిచే వైదిక మతం పట్ల విభిన్న సామాజిక వర్గాల్లో అసంతృప్తి జైన, బౌద్ధ మతాల పుట్టుకకు బలమైన నేపథ్యంగా పని చేసిందని చెప్పొచ్చు.

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్ధం నాటికి ఉత్తర భారత దేశంలో సంభవించిన పరిణామాలు సాంఘిక, ఆర్థిక తారతమ్యాలను తీవ్రతరం చేశాయి. కొత్తగా ప్రవేశించిన ధనం ధనిక – పేద తేడాలను తీవ్రం చేసింది. ఈ నేపథ్యంలో పేదలు ఒకప్పటి నిరాడంబర సమాజమే బాగుందని భావించడం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలోనే నిరాడం

బర జీవనమే ఉత్తమమని చెబుతూ జైన, బౌద్ధ మతాలు అవతరించాయి.

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దం నాటికి వైదిక మతం పూర్తిగా దిగజారింది. సంక్లిష్టమైన, వ్యయభరితమైన యజ్ఞాలు సామాన్యులకు భారంగా పరిణమించాయి. ఈ నేపథ్యంలో గందరగోళం లేని, సరళమైన మతాలను ప్రజలు కాంక్షించారు. ఆ ఆకాంక్షలే జైన, బౌద్ధాల రూపాన్ని తీసుకున్నాయి.

విశ్లేషణ: గతంలో జరిగిన సివిల్స్, గ్రూప్స్ పరీక్షల్లో ఇదే ప్రశ్నను వివిధ రూపాల్లో అడిగారు. 'జైన, బౌద్ధాలకు' బదులు 'కొత్త మతాలు' అని అడిగినా ఇదే సమాధానం రాయాలి. అంతేకాక కొత్త మతాల ఆవిర్భావానికి గల భౌతిక నేపథ్యం, సామాజిక నేపథ్యాన్ని గానీ ప్రత్యేకంగా అడగొచ్చు. ఇదే అంశంపై అడిగే అవకాశమున్న వివిధ రకాల ప్రశ్నలను పరిశీలించండి.

- క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దం నాటికి ఉత్తర భారత దేశంలో నెలకొన్న సామాజిక, ఆధ్యాత్మిక అసంతృప్తి కొత్త మతాలకు కారణమైంది– విశ్లేషించండి.
- ఇనుము ఆధారిత వ్యవసాయమే కొత్త మతాల ఆవిర్భావానికి దారి తీసింది– చర్చించండి

జైన మతం

Q జైన మత భావనలు, మత వ్యాప్తిని విశ్లేషించండి.

A జైనులు 24 మంది తీర్థంకరులను విశ్వసిస్తారు. 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడు సత్యం, అహింస, దొంగతనం చేయకుండా ఉండటం, ఆస్తులు కలిగి ఉండకపోవడం అనే నాలుగు సూత్రాలను ప్రతిపాదించగా వర్ధమాన మహావీరుడు బ్రహ్మచర్యం అనే ఐదో సూత్రాన్ని జోడించాడని తెలుస్తోంది. ఈ ఐదు సూత్రాలను జైనులు 'పంచ సూత్రాలు'గా భావించి.. త్రికరణ శుద్ధిగా ఆచరిస్తే ఆత్మ పరిశుద్ధమై 'కైవల్యం' సిద్ధిస్తుందని విశ్వసించారు.

సరైన విశ్వాసం, సరైన జ్ఞానం, సరైన ఆచరణ అనే మూడు అంశాలను జైనులు 'త్రిరత్నాలు'గా భావిస్తారు. జైన మతతత్వంలో 'శ్యాద్వద' సిద్ధాంతానికి ఎంతో ప్రాధాన్యముంది. జ్ఞానం సాపేక్షమైంది కాబట్టి సత్యాసత్యాలను సంపూర్ణంగా నిర్ధారించలేమని ఈ సిద్ధాంతం పేర్కొంటుంది. జైన మతం చరాచర వస్తువులన్నింటికీ ఆత్మ ఉంటుందని చెప్పడం వల్ల జైనుల్లో అహింసా సిద్ధాంతం విపరీతంగా పరిణమించింది.

జైన మతంలోని స్వచ్ఛత కారణంగా తొలి దశలో ప్రజల్ని బాగానే ఆకర్షించింది. సంస్కృతానికి బదులు 'అర్ధమాగధి' భాషను వాడటం వల్ల జైనం సామాన్యులకు చేరువైంది. మత ప్రచారం కోసం మహావీరుడు 'సంఘం' స్థాపించి, స్త్రీ పురుషులిరువురికీ ప్రవేశం కల్పించాడు. సంఘ సభ్యులు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ మత వ్యాప్తికి కృషి చేశారు.

జైనం బ్రాహ్మణాధిక్యతను నిరసించడం వల్ల సహజంగానే బ్రాహ్మణేతర వర్గాల్లో ప్రాచుర్యం పొందింది. రాజ పోషణ కూడా జైనం వ్యాప్తికి దోహదం చేసింది. వత్సరాజు ఉదయనుడు జైనుడని ప్రతీతి. చంద్రగుప్త మౌర్యుడు, అశోకుడి పౌత్రుడైన సంప్రతి జైనమతాన్ని అభిమానించినట్లు తెలుస్తోంది. కళింగ పాలకుడైన ఖారవేలుడు మౌర్యానంతర యుగంలో జైన మత వ్యాప్తికి కృషి చేశాడు. రాష్ట్ర కూటులు, కళ్యాణి చాళుక్యులు జైనమతాన్ని పోషించారు.

జైనంలో ఉన్న విపరీత క్రమశిక్షణ, కఠోర సాధనలు దాని వ్యాప్తిని నిరోధించాయని చెప్పొచ్చు. జైనం 'అహింస'కు విపరీత ప్రాధాన్యం ఇవ్వడం కూడా దాని వ్యాప్తికి ఆటంకమైంది. యుద్ధ జీవులైన క్షత్రియులకు.. పంటనాశించే క్రిమి కీటకాలను చంపే రైతులకు జైనం చెప్పిన విపరీత 'అహింస' రుచించలేదు. అందువల్లే జైనం ప్రధానంగా వాణిజ్య వర్గాల్లోనే అధిక వ్యాప్తిని పొందింది. భౌగోళికంగా కూడా జైనం వ్యాప్తి పరిమితంగా ఉంది. మధ్య యుగాల నాటికి గుజరాత్, రాజస్థాన్‌లలోని కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది.

Q భారతీయ సంస్కృతికి జైనం అందించిన సేవలు వివరించండి

A క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దంలో ఆవిర్భవించిన జైన మతం నాటి నుంచి నేటి వరకు భారతదేశంలో అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ, భారతీయ సంస్కృతిపై తనదైన ముద్రను చాటుతోంది. నేటికీ రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో అధికంగా.. మధ్య భారతం, దక్షిణ భారతదేశంలో అక్కడక్కడా కనిపిస్తూ దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని బలపరుస్తోంది.

జైనం వైదిక కర్మకాండలను నిరసించి, నిరాడంబర నైతిక జీవనమే కైవల్య ప్రాప్తికి దారి తీస్తుందని చాటి చెబుతూ భారతీయ ఆధ్యాత్మిక రంగంలో కీలక ప్రభావాన్ని కలిగించగలిగింది. మహావీరుడు ప్రదర్శించిన కఠోర క్రమశిక్షణ, దిగంబరత్వం వంటి అంశాలు తదనంతరం ఎందరో సాధకులకు మార్గదర్శకాలయ్యాయి. 'పంచ వ్రతాలు' అనే జైనం ప్రవచించిన అంశాలు హిందూ మతంలోకి ప్రవేశించి, బహుళ ప్రాచుర్యాన్ని పొందాయి. ముఖ్యంగా 'అహింస' భావనకు జైనం కల్పించిన విపరీత ప్రచారం హిందూ మతాన్ని కూడా ప్రభావితం చేసి, జీవకారుణ్య భావనను వ్యాప్తిలోకి తెచ్చింది. గాంధీ అహింసావాదంపై కూడా గుజరాత్‌లో ప్రాచుర్యంలో ఉన్న జైనం ప్రభావం ఉందని చెప్పొచ్చు. సత్యం సాపేక్షమైందని, సత్యం సంపూర్ణ స్వరూపం ఎవరికీ అందుబాటులో ఉండదనీ గాంధీ భావించడం, జైనం ప్రచారం చేసిన 'శ్యాద్వద' సిద్ధాంతానికి దగ్గరగా ఉండటం విశేషం.

జైనులు సంస్కృతాన్ని కాదని, ప్రజలకు దగ్గరగా ఉండే భాషలను స్వీకరించి, వాటిని వృద్ధి చేసి, ప్రచారంలోకి తెచ్చారు. 'అర్ధమాగధి'ని ప్రధాన మాధ్యమంగా వాడుతూ దాని ప్రాచుర్యానికి కారణమయ్యారు. అలాగే 'అపభ్రంశ' భాషకు సంబంధించిన ప్రాథమిక రచనలన్నీ జైనులే చేశారు. జైనులు శౌరసేని భాషను ఆదరించారు. ఈ భాష నుంచే ఆధునిక మరాఠీ ఆవిర్భవించింది. ఇక కన్నడ భాషా

సాహిత్యాల వికాసంలో జైనులదే ప్రధాన పాత్ర.

జైనులు తమ మత సాహిత్యాన్ని ప్రధానంగా 12 అంగాలుగా క్రోడీకరించారు. జైన సన్యాసులు, సన్యాసినులు రాసిన 'తేరాగాధా, తౌరీ గాధా' వంటి కవితా సంకలనాలు విమర్శకుల ప్రశంసలు అందు కున్నాయి.

జైనులు విగ్రహారాధనను ప్రోత్సహించడం ద్వారా శిల్ప కళా వికా సానికి దోహదపడ్డారు. మౌర్యానంతర యుగంలో వర్ధిల్లిన మధుర శిల్పశైలి తొలి దశలో జైనులే కీలక పాత్ర పోషించారని పరిశోధకుల అభిప్రాయం. మధుర శిల్ప శైలి తదనంతర గుప్త శిల్ప శైలిని ప్రభా వితం చేయడం విశేషం. ఇంకా దేశ వ్యాప్తంగా కనిపించే తీర్థంకరుల విగ్రహాలు జైనుల శిల్ప కళా పోషణకు నిదర్శనాలు. శ్రావణ బెళగొళ లోని గోమఠేశ్వరుని మహాశిల్పం ఇందుకు మంచి ఉదాహరణ.

జైన మతం వాస్తు కళను ప్రోత్సహించింది. దేశవ్యాప్తంగా వెలుగు చూసిన గుహాలయాలు, విహారాలు, దేవాలయాలే ఇందుకు నిదర్శ నాలు. రాజస్థాన్‌లోని అబూ పర్వతాల్లో కనిపించే దిల్వారా దేవాల యాలు జైనుల కృషికి తార్కాణాలు. దక్షిణ భారతదేశంలో కాలాము ఖులు, వీర శైవులు జైన కట్టడాలను ఎన్నిటినో ధ్వంసం చేసి ఉండక పోతే మరెన్నో జైన నిర్మాణాలు కనిపించేవి.

జైనులు కేవలం ఆధ్యాత్మిక చింతనకే పరిమితం కాకుండా జ్యోతిష్య, సర్ప, వైద్య విద్యలను అభ్యసించి సమాజ సేవలో పాల్గొ న్నారు. విద్యా వ్యాప్తికి కృషి చేశారు. విద్యా బోధన 'ఓం నమః సిద్ధం నమః'అనే వాక్యంతో మొదలయ్యేది. శైవం విజృంభించాక దీనిని 'ఓం నమశ్శివాయ'గా మార్చారని పరిశోధకుల భావన. జైనులు తర్క, వ్యాకరణ, తదితర విజ్ఞాన శాస్త్రాల్లో కృషి చేసి ఎన్నో శాస్త్రీయ రచనలు చేశారు.

జైనులు పట్టణీకరణ వృద్ధి, వికాసంలో కీలక పాత్ర పోషించారు. వస్తు మారకంలో, ద్రవ్య వినిమయంలో కూడా ప్రధాన భూమికను పోషించి భారతదేశ ఆర్థిక చరిత్రను ప్రభావితం చేశారు.

ఎక్స్‌పెక్టెడ్ కొశ్చన్స్

- భారతీయ సంస్కృతికి బౌద్ధం చేసిన సేవలను అంచనా వేయండి?
- బౌద్ధ మత వ్యాప్తికి, పతనానికి కారణాలను విశ్లేషించండి?
- మహాయాన బౌద్ధం నేపథ్యాన్ని, ప్రభావాన్ని పరిశీలించండి?